క్లుప్తంగా

బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడిగా మోహన్



శాయంపేట : బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా శాయంపేటకు చెందిన మారెపల్లి మోహన్‌ను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిల ఆదేనుశాసారం నియమించినట్లు మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కమిటీలు వేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వెంకటరమణరెడ్డి, జ్యోతిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరికిళ్ల ప్రసాద్, గాజె రాజేందర్, విజయ్‌కుమార్ శ్రీనివాస్, సంజీవరావు, శ్రావణ్‌కుమార్, కరుణ్‌బాబు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



శాయంపేట : మండల కేంద్రంలోని తాళ్లకుంట చెరువు సమీపంలోని మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ పండుగకు పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ అధికారుల ఆదేశాల మేరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం చెరువు శిఖరంలో మొలచిన కట్లయి మొక్కలను, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను జేసీబీతో తొలగించారు. ప్రాంగణంలో పెరిగిన గడ్డిపై మల్టీపర్పస్ సిబ్బందితో గడ్డి మందు పిచికారీ చేయించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



శాయంపేట : కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంతోనే భారతదేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ సభ్యత్వ ప్రబారి జి.మొగిలి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం రమేశ్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ విశ్రాంతి లేకుండా దేశ ప్రజల కోసం పని చేస్తూ దేశాన్ని అభివృద్ధి చేస్తున్నాడని కొనియాడారు. మోడీకి ప్రతి భారతీయుడు మద్దతుగా నిలవాలని కోరారు. కొన్ని శక్తులు దేశాన్ని ముక్కలుగా విభజించాలని చూస్తున్నాయని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత భారతీయులపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీకాంత్, సుమన్, తిరుపతి పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు



ఆత్మకూరు: మండలకేంద్రంలో పోచమ్మసెంటర్ వద్ద దుర్గా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం మూడో రోజు దుర్గామాత చంద్రఘంటా అవతారంలో దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కేయూలో కొనసాగుతున్న ఎన్‌సీసీ శిబిరం

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ బెటాలియన్ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్.రామదురై పర్యవేక్షణలో వరంగల్, ఖమ్మం గ్రూపుల రిపబ్లిక్ డే సన్నాహక క్యాంపు కొనసాగుతోంది. ఈమేరకు రిపబ్లిక్ డే క్యాంపు, డ్రిల్, పరేడ్, సాంస్కృతిక విభాగం, బెస్ట్ కెడెట్, ఫ్లాగ్ ఏరియా, ఆయుధాలతో శిక్షణ పద్ధతులను వరంగల్ గ్రూపు కమాండర్ కల్నల్ సచిన్‌అన్నారావు శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. 2025లో న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే పాల్గొనే ఎన్‌సీసీ కేడెట్లకు పలు సూచనలు చేశారు. క్యాంపులో డిప్యూటీ కమాండర్ లెఫ్టినెంట్ రవి సునారే, సుబేదారి మేయర్ సొరస్య, కెప్టెన్ విజయ్, లెఫ్టినెంట్ ఎస్.స్వామి, రాజమాణిక్యం, వాసు, భవాని, సూపరింటెండెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక ప్రజల అవస్థలు

- ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి తప్పని తిప్పలు
- ఎండ,వానకు రోడ్డుపైనే నిల్చునే దుస్థితి



అంబేడ్కర్ సెంటర్‌లో ఎండలోనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

వేలేరు : వేలేరు నుంచి హనుమకొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మండల కేంద్రంలో బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చార్జీల పేరుతో ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సౌకర్యాలు కల్పించడంలో మాత్రం దృష్టి సారించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. పీచర, వేలేరు ఇతర గ్రామాల ప్రజలు బస్టాండ్ లేక వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు ఎండకు, వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు కిరాణా షాపులు, ఇతర ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల ఎదుట గంటల కొద్దీ బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా వివిధ పనులపై మండల కేంద్రానికి, బ్యాంకులకు వచ్చే మహిళా ప్రయాణికులకు, బస్‌షెల్టర్, టాయిలెట్ సౌకర్యం లేక వారు పడే బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సుల కోసం ఎండలో నిలబడాల్సిందే



వేలేరు నుంచి హనుమకొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సుల కోసం ఎండలో నిలబడాల్సిందే. వేలేరు మండలంగా ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ఇప్పటివరకు మండలంలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు ప్రభుత్వం తరఫున చేపట్టలేదు. అధికారులు బస్టాండ్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి.

– కాట్రేవుల రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు

ముగిసిన నల్‌జల్‌మిత్ర శిక్షణ శిబిరం



ఎల్కతుర్తి : శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు



శాయంపేట: పంపు ఆపరేటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో నల్‌జల్ మిత్రమా అనే స్కీం ద్వారా చేపట్టిన ప్రతీ ఇంటికి నల్లా వచ్చే విధంగా శాశ్వత పరిష్కారం గ్రామ మంచినీటి సహాయకుల కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజుల శిక్షణ తరగతులు చివరిరోజు శనివారం ముగిసింది. మొదటి రోజు చేతిపంపు శిక్షణ కార్యక్రమం, రెండో రోజు పైపులైన్ లీకేజీ, మూడో రోజు బోర్‌మోటర్ మరమ్మతులు, చివరిరోజు నీటి నాణ్యత పరిరక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మిషన్ భగీరథ డీఈ అనీల్ హాజరై మాట్లాడారు. శిక్షణకు హాజరైన ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేయాలన్నారు. అదేవిధంగా ఇంటింటికి నల్లా వచ్చే విధంగా చూసి రిపేర్లు, మరమ్మతులు ఉన్నట్లైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, సూచనలు, సలహాలు ఇచ్చారు. శిక్షణకు హాజరైన ప్రతీ ఒక్కరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశా రు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, ప్రవీణ్, మైక్రో బయాలజిస్ట్ సోమిరెడ్డి, ల్యాబ్ అసిస్టెంట్ భాస్కర్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్లు అందుబాటులో ఉండాలి

శాయంపేట : ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని 24 గ్రామాల గ్రామ పంచాయతీల్లో పంపు ఆపరేటర్లకు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. భగీరథ పథకంలో శుద్ధి చేసిన నీటిని పైపులైను లీకేజీలు కాకుండా నేరుగా ట్యాంకులకు మళ్లించి, ట్యాంక్ నుంచి ప్రతి ఇంటింటికి కుళాయిల ద్వారా సరఫరా జరుగడానికి ఆపరేటర్లు కృషి చేయాలన్నారు. కేటాయించిన సమయాల్లో ఆపరేటర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. శనివారం ప్లంబింగ్, పైపులైను లీకేజీ, నల్లా కలెక్షన్ గురించి శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆపరేటర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఈ మధుకుమార్, ఇంట్రా ఏఈ వెంకటేష్, గ్రిడ్ ఏఈ వహీద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల త్యాగాల దినం

హన్మకొండ: హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ -1,-2 డిపోల్లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ రక్షణ– కార్మికుల త్యాగాల దినాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర కార్మికుల చిత్రపటాలపై కార్మికులు పూలు చల్లి నివాళులర్పించారు. కార్మికులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 2019 అక్టోబర్, నవంబర్ మాసాల్లో 55 రోజుల పాటు సమ్మె చేశారని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 25 మంది కార్మికులు బలవన్మరణం చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ప్రతి యేటా వారి సంస్మరణార్థం కార్మికుల త్యాగాల దినాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు.

‘వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి’

హసన్‌పర్తి: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే డీఎస్సీ నియామకాలు చేపట్టాలని ఎంఎస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండారు సురేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి డీఎస్సీ నియామకాలు చేపట్టాలని కోరుతూ ఈనెల 9న జిల్లా కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పవన్, అరవింద్, మహేందర్, పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



ఆత్మకూరు : బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

కమలాపూర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మహిళా అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటలు ఆడి, పాటలు పాడారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బంధాలు, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ అని, ఇదో పూల పండుగ అన్నారు. గౌరీ దేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణకే ప్రత్యేక పండుగ అన్నారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీఓ జ్యోతి, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్ కుమార్, రజిత, కవిత, శారద, సరోజన, శోభ, యామిని, పూర్ణతిలక, కుమారస్వామి, లైబ్రేరియన్ అశోక్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బతుకమ్మ సంబురాలు

ఆత్మకూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీరాజ్, ఐకేపీ మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ లలితాదేవి పాల్గొన్నారు.

ధర్మసాగర్: మానవులకు సకల జీవరాశులకి ఆశ్రయాన్ని, బతుకును ఇచ్చిన ప్రకృతికి కృతజ్ఞత తెలిపే పండుగ బత్కమ్మ అని ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్న రంగుల పూలతో పేర్చిన బత్కమ్మలతో విద్యార్థులు అధ్యాపకులు సాంప్రదాయ పాటలతో నృత్యాలతో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు అజయ్, బాబూరావు, రాములు, వెంకట్, గోపాలకృష్ణ, సదానందం, లావణ్య, శివరంజని, గణేష్, రాజేందర్, ముత్తయ్య, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తిలోని నాగార్జున పాఠశాలలో శనివారం బతుకమ్మ ఉత్సవా లను నిర్వహించారు. బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించగా ప్రథమ బహుమతి సీహెచ్ సిరి, ద్వితీయ బహుమతి పల్లెబోయిన ఆశ్రిత, తృతీయ బహుమతి పరుపాటి తన్మయి గెలుచుకోగా కరస్పాండెంట్ గుర్రం అశోక్, ప్రిన్సిపాల్ దినేష్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, రజని, శైలజ, మానస, తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళా అధ్యాపకులు



ధర్మసాగర్: బతుకమ్మలతో ప్రిన్సిపాల్, మహిళా అధ్యాపకులు



శాయంపేట : బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దసరా సెలవుల్లో తరగతులు

- నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాకం
- గేట్‌కు, ప్రిన్సిపాల్ గదికి తాళం వేసిన ఎంఈఓ

విద్యారణ్యపురి: దసరా సెలవుల్లో పదవ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ గదికి, గేట్‌కు ఎంఈఓ తాళం వేశారు. ప్రిన్సిపాల్‌కు నోటీసు జారీ చేశారు. సెలవుల్లో తరగతుల నిర్వహణపై డీఈఓకు ఫిర్యాదు వెళ్లడంతో హనుమకొండ ఎంఈఓ రమేష్‌బాబు ఆ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు తరగతులు జరుగుతున్నట్లుగా గుర్తించి, ఆ విద్యార్థులను బయటికి పంపించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు శ్రీచైతన్య స్టడీ మెటీరియల్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. హైస్కూల్‌కు సెంచరీ హైస్కూల్ పేరుతో అనుమతి ఉందన్నారు. ఇచ్చిన నోటీస్‌కు రెండు రోజుల్లో ప్రిన్సిపాల్ వివరణ ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు

హనుమకొండలో నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తాము జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లామని ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ సుజిత్ తెలిపారు. డీఈఓ వెంటనే స్పందించి ఎంఈఓను పంపించారని తనిఖీ చేసి పాఠశాలకు తాళం వేశారని వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అరుణ్, భరత్, శ్రవణ్‌కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేస్తాం

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఈమేరకు వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, కమిటీ సభ్యులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రా మకృష్ణ, మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్‌తో కలిసి ఏసీపీ శనివారం సందర్శించారు. ట్రాఫిక్ మళ్లింపు, వాహన పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ, వీవీఐపీ ఎంట్రెన్స్ గేట్లు, సందర్శకుల కోసం భారీ గేట్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలు, కార్ల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేడిది మధుసూదన్, మండ వెంకన్న, వెలిదే శివమూర్తి, వంగరి కోటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్య, విజ్ఞానంతోనే లక్ష్యం సాధ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ కె.లలితా దేవి, డీఐఈఓ గోపాల్
- ఘనంగా ఎస్వీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు



అధ్యాపకులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కె.లలితా దేవి

పరకాల: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరాలంటే విద్య, విజ్ఞానంతోనే సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.లలితా దేవి, డీఐఈఓ గోపాల్ అన్నారు. పరకాల పట్టణంలోని ఎస్వీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు ఎంతో సంబురంగా జరుపుకున్న ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్వీ కళాశాల పూర్వ విద్యార్థిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.లలితాదేవి, డీఐఈఓ గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణ, పట్టుదలతో చదువుపై ప్రత్యేక దృష్టి సారించినప్పుడే ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులు పెట్టుకున్న కలలను సాధించగలరని అన్నారు. గురువులు, తల్లిదండ్రులపై గౌరవంగా నడుచుకోవడం వలన విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటలు వేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్వీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి, ఎస్వీ కళాశాల కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్ డాక్టర్ అభితేజ, డాక్టర్ అనూహ్య, వైస్ ప్రిన్సిపాల్ శివాజీ గణేష్, పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

- 1500 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం
- 35 లీటర్ల గుడుంబా స్వాధీనం
- ఏడుగురిపై కేసు నమోదు



మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : ప్రభుత్వ నిషేధిత నాటుసారా స్థావరాలపై పరకాల సబ్ డివిజన్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా శనివారం మండలంలోని సూర్యనాయక్ తండాలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెల్లం పానకం లభ్యం కాగా అక్కడే ధ్వంసం చేశారు. 35 లీటర్ల గుడుంబా, నాలుగు కిలోల బెల్లం పటిక లభ్యం కాగా స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నాటుసారా తయారు చేస్తున్న సూర్యనాయక్ తండాకు చెందిన బానోతు శోభన్, మాలోతు రాజేందర్, జర్పుల లచ్చు, మమత, లావుడ్య జమ, శ్రీనివాస్, మాలోతు రాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తయారీదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అన్నారు. నాటుసారా తయారు చేయడం వలన మద్యానికి బానిసై ఎంతో మంది యువకులు మృతి చెందడంతో చిన్న వయస్సులోనే మహిళలు వితంతువులుగా మారుతున్నారని గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నాటుసారా తయారీ మానేసి కుటీర పరిశ్రమలు స్థాపించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. దాడుల్లో పరకాల, ఆత్మకూరు, శాయంపేట సీఐలు క్రాంతి, సంతోష్, రంజిత్‌రావు, ఎక్సైజ్ సీఐలు తాతాజీ, రమేష్‌చంద్ర, సబ్ డివిజన్ నలుగురు ఎస్సైలు, 40 మంది సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మోరీపైనుంచి పడి వృద్ధుడి మృతి



ఐలయ్య మృతదేహం

ఎల్కతుర్తి: ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు మోరీపై నుంచి పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రం శివారులోని శ్మశానవాటిక సమీపంలో చోటు చేసుకుంది. శనివారం ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన మైస ఐలయ్య(67) గ్రామం నుంచి ఎల్కతుర్తిలో వృద్ధాప్య పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో ఎండవేడిమి తట్టుకోలేక మండల కేంద్రం సమీపంలోని పెద్దమోరీపై కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు మోరీ కిందపడడంతో కింద ఉన్న బండరాళ్లపై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వినోద ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..



రాజిరెడ్డి (ఫైల్)

ఎల్కతుర్తి: ద్విచక్ర వాహనం (స్కూటీ) అదుపు తప్పి రోడ్డుపై పడి తీవ్ర గాయాలైన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన సంఘటన మండలంలోని పెంచికలపేటలో చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేటకు చెందిన సురకంటి రాజిరెడ్డి(70) శుక్రవారం టీవీఎస్ స్కూటీపై తన సొంతపని నిమిత్తం వల్బాపూర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో ఎస్సార్‌ఆర్ ఫార్మసీ కళాశాల సమీపంలోని హన్మకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై అదుపుతప్పి రోడ్డుపై పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చెసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు : సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై పస్తం శ్రీనివాస్ కోరారు. వరంగల్ సీపీ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి సెంటర్ వద్ద జాగృతి కళా బృందం అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా చదువు, రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలు, డయల్ 100, సీసీ టీవీ కెమెరాలు, వృద్ధ తల్లిదండ్రులను సరిగా చూసుకోవాలని, అలాగే మూఢనమ్మకాలపై మ్యాజిక్‌షోతో పాటు పలు సామాజిక అంశాలపై పాటల ద్వారా వివరించారు. అదేవిధంగా సైబర్ క్రైంను నాటిక ద్వారా ప్రదర్శించి 1930 హెల్ప్‌లైన్ నంబర్ గురించి వివరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసవుతుందన్నారు. గుట్కా, గంజాయి తదితర నిషేధిత వస్తువులను యువకులు వాడుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇటీవల వాట్సాప్‌లలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి అనేక మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. తెలిసిన నంబర్ నుంచి గాని లేదా అధికారులం అని కాని ఎవరైనా డబ్బులు పంపమని అడిగితే తప్పనిసరిగా క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు. సుమారు 250 మందికి పైగా ప్రజలు పాల్గొన్న కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ ఎస్సై నాగమణి, కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.